క్లుప్తంగా

ప్రతిభ ఉన్న విద్యార్థికి చేయూత



భవ్యశ్రీకి వయొలిన్ అందజేస్తున్న దాతలు

ఒంగోలు సెంట్రల్: ప్రతిభ ఉన్న విద్యార్థులకు సూర్యశ్రీ ట్రస్ట్ అండగా ఉంటుందని ట్రస్ట్ వ్యవస్థాపకుడు మండల మురళీకృష్ణ అన్నారు. స్థానిక ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయంలో భరతనాట్యం, వయొలిన్‌లో శిక్షణ పొందుతున్న భవ్యశ్రీని ప్రోత్సహించే నిమిత్తం రూ.15 వేల విలువైన వయొలిన్‌ను దాతలు కనపర్తి రాజ్, శిల్పా రాఘవేంద్ర ఆర్థిక సహకారంతో మురళీకృష్ణ దంపతులు అందించారు. భవిష్యత్‌లో విద్యార్థి అవసరాలకు తోడుగా ఉంటామని హామీ ఇచ్చారు. ట్రస్ట్ నిర్వాహకులు సర్దార్‌బాషా షహనాజ్ దంపతులు, ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మార్నెళ్ల సుబ్బారావు, ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్‌బాషా, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనాంచారమ్మ తల్లికి ఘటం



ప్రత్యేక అలంకరణలో శ్రీ నాంచారమ్మ తల్లి



గ్రామంలో తిరగడానికి సిద్ధం చేసిన ఘటం



తల మీద పెట్టుకుని తిప్పుతున్న ఘటం


- ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కొత్తపట్నం: శ్రీనాంచారమ్మ తల్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఘటాన్ని ప్రారంభించారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎంతో వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఒక్కోరోజు ఒక్కోరకంగా శ్రీ నాంచారమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవాలు నిర్వహిస్తారు. రాష్ట్రంలో నలుమూలల నుంచి లక్షలాది మంది తిరునాళ్లలో పాల్గొంటారు. కొత్తపట్నం గ్రామం నుంచి వ్యాపారం, బతుకుదెరువు రీత్యా చెన్నై, బెంగళూరు, తదితర రాష్ట్రాలకు వెళ్లిన వారు కూడా ఈ తిరునాళ్లకు వస్తారు. శ్రీ నాంచారమ్మ తల్లికి గొప్ప విశిష్టత ఉంది. ముందుగా ఘటాన్ని ప్రారంభిస్తారు. ఘటం అంటే శ్రీ నాంచారమ్మ తల్లి ఆలయం నుంచి పసుపు కుంకుమను మేళతాళాలతో ఊరేగింపుగా చాకిలిపాలెంలో ఉన్న నాగార్పమ్మ వద్దకు తీసుకెళ్తారు. అక్కడ కుంభం పోసి పూజలు చేస్తారు. అక్కడి నుంచి గ్రామ కాపు అయిన గౌరవరపు కోటయ్య నివాసం వద్ద ఉన్న దేవర గృహానికి చేరుకుంటారు. రోకలి, ధాన్యంతో పూజలు చేస్తారు. అక్కడ మట్టికుండకు పసుపు, కుంకుమతో పూజ చేసి వేప ఆకులు చుట్టి పువ్వులతో అలంకరిస్తారు. కుండలో మజ్జిగ, నైవేద్యం వేసి ఘటాన్ని ఏర్పాటు చేస్తారు. గ్రామ కాపు చేయాల్సిన సంప్రదాయ కార్యక్రమాలు చేస్తారు. అక్కడి నుంచి ఊరేగింపుగా రెడ్డిపాలెంలో సింగిరి ఆంజనేయులు ఇంటి దగ్గరకు వెళ్లి పూజలు చేస్తారు. పూజల అనంతరం శ్రీనాంచారమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. మంగళవారం నుంచి ప్రతిరోజూ ఘటం తిరుగుతుంది. ఘటం ప్రారంభించిన 45 రోజులపాటు తిరిగి జూలై 24న నిలుపుదల చేస్తారు. 45 రోజులు గ్రామాల్లో తిరుగుతుంది. ఘటాన్ని తలమీద పెట్టుకుని తిప్పుతారు. ఇంట్లో వండిన అన్నం, కూరలు ఎంగిలి చేయకుండా మొదటిగా తీసిపెట్టి ఆ ఘటంలో వేస్తారు. ప్రతి వీధికి వెళ్తుంది. కె.పల్లెపాలెంలో కూడా ఘటం తిరుగుతుంది. పూర్వం నుంచి వస్తున్న ఆనవాయితీ, ఆచారాల ప్రకారం ఘటాన్ని తిప్పుతారు. జూలై 24న ఘటాన్ని నిలుపుదల చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తారు.

నేడు పోలేరమ్మ అమ్మవారి శిడులు



పోలేరమ్మ అమ్మవారు



విద్యుత్ కాంతులతో అలంకరించిన ఆలయం

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో వెలసిన పోలేరమ్మ అమ్మవారికి మంగళవారం శిడులు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు సాయంత్రం గొర్రెల పెంపకందారులు ప్రత్యేకంగా అమ్మవారికి పొట్టేళ్ల ప్రభలతో గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు.

వేద పురోహితులకు వస్త్రదానం

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు రోడ్డులోని అయ్యప్ప నగర్‌లో మురళీకృష్ణ మందిరం ఎదురు భరద్వాజ మహర్షి వేద పాఠశాలలో వేదవిద్య అభ్యసిస్తున్న ఐదుగురు విద్యార్థులకు, ఐదుగురు వేద పురోహితులకు ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఉపాధ్యక్షుడు మహంకాళి శేషయ్య చేతుల మీదుగా సోమవారం వస్త్రదానం చేశారు. వేద పాఠశాల గురువులు, వేద పురోహితులైన నేల్లంబొట్ల సదాశివయ్య, కంచి కామాక్షి అమ్మవారి దేవస్థానం ప్రధాన అర్చకుడు నాగేశ్వరరావుశర్మ, సీతారాంపురంలోని సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు భారతుల శ్రీనివాస శర్మ, గొడుగుపాలెంలోని రామమందిరం అర్చకుడు మహంకాళి మురళీకృష్ణశర్మ, అర్చక స్వాములు రాము శర్మ, భరద్వాజ మహర్షిలకు వస్త్రాలు పంపిణీ చేశారు.



వేద పురోహితులు, విద్యార్థులకు వస్త్రదానం చేస్తున్న శేషయ్య

అనంతరం వేద విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు, వేద పురోహితులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

పెద్దారవీడు: రైతులు పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేసుకుంటే నేల భౌతిక స్థితి మెరుగుపడి గుల్లగా మారుతుందని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి సోమవారం తెలిపారు. ఆర్బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై జనుము 6 టన్నులు, జీలుగలు 4 టన్నులు, పిల్లిపెసర 2 టన్నులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవడం వలన నేల భౌతిక స్థితి మెరుగుపడి భూమి గుల్లగా మారి నేలలోకి నీరు ఇంకే గుణం పెరుగుతుందన్నారు. భూమిలో సేంద్రియ పదార్థం పెరగడం వల్ల సూక్ష్మజీవులు వృద్ధి చెంది జీవ రసాయనిక చర్యలతో భూసారం పెరగడమే కాకుండా నేల సంపూర్ణ ఆరోగ్యాన్ని సంతరించుకుని ఉత్పాదకత సామర్థ్యం కూడా పెరుగుతుందన్నారు. పప్పు జాతి పంటల వల్ల రైజోబియం బ్యాక్టీరియా పెరగడం వల్ల ఎకరాకు 20 నుంచి 50 కేజీల నత్రజని అందుతుందని, ఆ మేరకు రసాయన ఎరువులు తగ్గించుకోవచ్చని అన్నారు. భూమి లోతుల్లో ఉన్న పోషకాలను కూడా ఉపరితలానికి తీసుకొచ్చి పంట మొక్కలు వాటిని వినియోగించుకునేలా మారుస్తాయన్నారు. జనుము, జీలుగు, పిల్లిపెసర వంటి పిచ్చిరొట్ట పైర్లను సాగు చేయాలని, పూతదశ వరకు పెంచి భూమిలో కలియదున్నాలని, పశువులకు పచ్చిమేతగా కూడా వాడుకోవచ్చని అన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారుని పాస్ పుస్తకం, ఫోన్ నంబరుతో ఆర్బీకేల్లో ఉన్న వీఏఏలను సంప్రదించాలని తెలిపారు.

పచ్చిరొట్ట ఎరువులు సాగుచేయాలి

దొనకొండ: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దుక్కులు దున్నుకొని పచ్చిరొట్ట ఎరువులు సాగు చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎస్ లక్ష్మీనారాయణ తెలిపారు. వ్యవసాయశాఖ ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు, జనుములు, పిల్ల పెసరలు, జీలుగలు 50 శాతం రాయితీపై అందజేస్తున్నామన్నారు. ఈ ఏడాదికి మండలానికి 3 క్వింటాళ్ల జీలుగలు, 7 క్వింటాళ్ల జనుములు కేటాయించామన్నారు. పచ్చిరొట్ట వేయటం వల్ల పంటలకు చాలా ఉపయోగాలున్నాయని, నేల గుల్లగా మారి నీరు ఇంకే గుణం పెరుగుతుందన్నారు. నేలలో సూక్ష్మజీవులు పెరిగి జీవ రసాయనిక చర్యలు జరుగుతాయన్నారు. దీంతో నేల సారం పెరుగుతుందన్నారు. పొలాలకు ఎరువులు వేసినప్పుడు వాటి లభ్యత నేలలోని సూక్ష్మజీవులు పెంచుతాయన్నారు. పిల్ల పెసర, జీలుగలు పశువుల మేతకు ఉపయోగపడుతుందన్నారు. రైతులు పొలాల్లో భూసారం పెంచేందుకు, పంట మార్పిడికి జీలుగలు, పిల్ల పెసర సాగు చేయాలని సూచించారు.

వైభవంగా ఆలయ ఉత్సవం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో సోమవారం నారాయణస్వామికి అభిషేకోత్సవం, ఆలయ ఉత్సవం అర్చకులు మంకాల సత్యనారాయణ, శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా నారాయణస్వామి అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ స్వామిని పల్లకీపై ఉంచి ఆలయ ఉత్సవం నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, పలువురు తదితరులుపాల్గొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.2.54 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.2,54,213 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు సోమవారం తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.1.01 లక్షలు, లడ్డుప్రసాదాల అమ్మకంద్వారా రూ.30,150, ఆలయంవద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.1,12,031, ఇతర విరాళాల కింద రూ.11,032 అందజేశారన్నారు. అన్నదానానికి పశ్చిమ గోదావరిజిల్లా తణుకు వాస్తవ్యులు మాదవరపు నారాయణ సుబ్బలక్ష్మి దంపతులు రూ.25 వేల విరాళం ఇచ్చారన్నారు. కొమ్మినేని వెంకట్రావు, నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

ఉలవపాడు: అదుపుతప్పి కారు ఫెన్సింగ్‌ను ఢీకొట్టి గుంతలో పడింది. ఈ సంఘటన జాతీయరహదారిపై ఉలవపాడు దక్షిణ బైపాస్ సమీపంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఒంగోలు సుజాతానగర్‌కు చెందిన కామేష్ తన భార్యతో కలసి ఒంగోలు నుంచి కావలి వెళుతున్నారు. ఉలవపాడు వద్దకు వచ్చేసరికి మలుపు వద్ద ఫెన్సింగ్‌ను ఢీకొట్టి గుంతలోపడిపోయింది. ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదు. వేరే వాహనంలో వెళ్లిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు

కొమరోలు: కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటడంతో సామాన్య ప్రజలు వాటిని కొనలేని పరిస్థితిలో ఉన్నారు. రోజురోజుకూ ధరలు పెరిగిపోతూ ఉండడంతో జనం బెంబేలెత్తుతున్నారు. కూరగాయల ధరలను చూసి వాటిని కొనలేక పచ్చడి మెతుకులతో సరిపెట్టుకుంటున్నారు. రెండు వారాల క్రితానికి, ఇప్పటికి కూరగాయలు రెట్టింపు ధరలు ఉండడంతో సామాన్యులు వాపోతున్నారు. రెండు వారాల క్రితం వరకు టమోటా కిలో రూ.20 ఉండగా ప్రస్తుతం రూ.60 కు చేరింది. మిర్చి కిలో రూ.40 ఉండగా ప్రస్తుతం రూ.120 కు పెరిగింది. కాకర కిలో రూ.50 ఉండగా ప్రస్తుతం రూ.100 పెరిగింది. చిక్కుడు కిలో రూ.70 ఉండగా రూ.120, బీరకాయ కిలో రూ.40 ఉండగా రూ.80 పెరిగింది. రెండు వారాల వ్యవధిలోనే కిలోకు రెట్టింపు ధరలు తీసుకుంటున్నారు. వేసవిలో కూరగాయల దిగుబడి సరిగా లేకపోవడంతో కూరగాయల కొరత ఏర్పడింది. దీనితో వ్యాపారస్తులు అధిక ధరలు పెట్టి కూరగాయలను కొనుగోలు చేసి మార్కెట్లలో అధిక ధరలకు విక్రయిస్తున్న పరిస్థితి ఏర్పడింది.

దాతల సహకారం మరువలేనిది

బేస్తవారిపేట: దిక్కులేని పిల్లల భవిష్యత్ కోసం దాతలు అందించిన సహకారం ఎన్నటికీ మరువలేనిదని ఎస్సై నరసింహారావు అన్నారు. మండలంలోని జేబీకే పురంలో తల్లిదండ్రుల మరణంతో అనాథలుగా మిగిలిన ముగ్గురు పిల్లల కోసం దాతలు అందించిన సహకారంతో నూతన గృహాన్ని నిర్మించారు. సోమవారం గృహప్రవేశ కార్యక్రమంలో పలువురు దాతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహాన్ని ప్రారంభించిన ఎస్సై మాట్లాడారు. మానవత్వంతో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. గృహ నిర్మాణం పల్లెబోయిన గోపాల్, మేకల రామ్మోహనరావు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో దాతలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సహాయం

బేస్తవారిపేట: మండలంలోని జేబీకే పురంలో తల్లిదండ్రుల మృతితో ముగ్గురు పిల్లలు అనాథలుగా మారడంతో బేస్తవారిపేట ఎస్సై నరసింహారావు స్పందించారు. 2002–04 ఇంటర్మీడియెట్ బ్యాచ్‌కు చెందిన తన స్నేహితుల సహకారంతో రూ.20 వేల నగదును సోమవారం ముగ్గురు పిల్లలకు అందజేశారు. చిన్నారులు చదువుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. స్వచ్ఛంద, సేవా సంస్థలు, దాతలు ముందుకు వచ్చి అనాథ పిల్లలకు చేయూతనివ్వడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు.

పారిశుధ్య సమస్యను పరిష్కరించండి

కంభం: స్థానిక పార్కు వీధిలోని జెండా చెట్టు దర్గా చుట్టూ వీధుల్లో నుంచి వస్తున్న కాల్వల్లోని నీరు, వర్షపు నీరు నిల్వ ఉండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని సోమవారం పార్కువీధి ప్రజలు సర్పంచ్ పల్నాటి బోడయ్య, కార్యదర్శి బ్రహ్మయ్యలకు వినతి పత్రం అందజేశారు. పార్కు వీధిలో ఉన్న జెండా చెట్టు దర్గా వద్ద ఎన్నో ఏళ్లుగా ప్రజలు ప్రతి శుక్రవారం ప్రార్థనలు నిర్వహిస్తున్నారని పెళ్లిళ్ల సమయంలో ఇక్కడ జెండాలు పెట్టి తమ మొక్కులు తీర్చుకుంటుంటారని చెప్పారు. వీధుల్లోని నీరంతా ఇక్కడి చేరి నిల్వ ఉంటుండంతో ఇక్కడికి వచ్చే ప్రజలకు అసౌకర్యంగా ఉందని స్థానికులు అధికారుల దృష్టికి తెచ్చారు. మురుగు నీరు, వర్షపు నీరు వెళ్లే దారిలేక దర్గా చుట్టూ నీరు నిల్వ ఉండటంతో శిథిలావస్థకు చేరిపోతుందని పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకొచ్చినా స్పందన లేదని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

26.8 మి.మీ వర్షపాతం నమోదు

కనిగిరి రూరల్: కనిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలోని 13 మండలాల్లో మంగళవారం 26.8 మి.మీ వర్షపాతం నమోదు కాగా, సరాసరిన 2.0 మి.మీ నమోదైనట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో కనిగిరి మండలంలో 2.0 మి.మీ, హెచ్‌ఎంపాడులో 4.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు. మిగిలిన మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు.

గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు

ముండ్లమూరు: ప్రధానమంత్రి సురక్ష వందన యోజన పథకం ద్వారా గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని మారెళ్ల వైద్యాధికారి సీహెచ్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతి రోజు ఆహారంలో గుడ్లు, పాలు, ఆకుకూరలు తీసుకోవాలన్నారు. రక్తహీనతను నివారించేందుకు అవసరమైన మందులు ఆరోగ్య కేంద్రంలో ఇస్తామని, వాటిని అవసరాన్ని బట్టి వాడాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో ఒంగోలు ఎంసీహెచ్ ఆసుపత్రి, రిమ్స్, అంజలి వైద్యశాల, ప్రశాంతి నర్సింగ్‌హోమ్‌లో ఉచితంగా సిజేరియన్, సాధారణ కాన్పులు ఉచితంగా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ వెంకటరావు, హెచ్‌ఈ కేపీ రాజు, సిబ్బంది అంజమ్మ, ఆనంద్‌బాబు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

15 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు

వలేటివారిపాలెం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత సురక్ష యోజన కార్యక్రమంలో భాగంగా 15 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమానికి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రియంవద హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి మాతృత సురక్ష యోజన కార్యక్రమం ప్రతి ఒక్క నెల 9,10 తేదీల్లో ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహిస్తామని ఆమె తెలిపారు. గర్భిణులకు బీపీ, సుగర్, రక్త పరీక్ష, యూరిన్ పరీక్షలు వంటి పరీక్షలు చేస్తారన్నారు. వర్షాల నేపథ్యంలో గర్భిణులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వైద్యశాల రికార్డులు పరిశీలించారు. సీహెచ్‌ఓ శివరామయ్య, ఏఎన్‌ఎంలు పద్మ, మాలిని, ఆశావర్కర్ సుజాత తదితరులు ఉన్నారు.

నీట్‌లో సత్తాచాటిన విద్యార్థినికి సన్మానం

కంభం: నీట్ 2024 పరీక్ష ఫలితాల్లో 700/720 మార్కులు సాధించి సత్తా చాటిన కంభం విద్యార్థిని కరుమల్ల ప్రీతిని సోమవారం ఆల్ఫా హైస్కూల్ ప్రిన్సిపాల్ రితీష్ నాయర్ ఘనంగా సన్మానించారు. తమ పాఠశాలలో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థినికి నీట్‌లో మంచి మార్కులు రావడంపై పాఠశాల సిబ్బంది, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పలువురు అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల పిల్లలకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో డీఎస్పీ కిషోర్‌కుమార్, రమణారెడ్డి

ఒంగోలు: ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమని ఒంగోలు డీఎస్పీ కిషోర్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక భాగ్యనగర్ 4వ లైనులో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల పిల్లలకు నోటు పుస్తకాలను శ్రీసరస్వతి విద్యా సంస్థల అధినేత రమణారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ సమాజ మార్పు కోసం అనునిత్యం పరితపించే జర్నలిస్టులు, వారి కుటుంబాలు కూడా మెరుగైన జీవనం పొందేలా దాతల సహకారం ఎంతో అభినందనీయమన్నారు. పుస్తకాల దాత రమణారెడ్డి మాట్లాడుతూ సమాజ మార్పులో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. అలాంటి జర్నలిస్టులు వారి కుటుంబాల బాగోగులు చూసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. అనంతరం డీఎస్పీ కిషోర్‌కుమార్, రమణారెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు గొట్టిపాటి నాగేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు గేరా అజయ్‌బాబు, కార్యదర్శి వసంత్‌కుమార్, కోశాధికారి వేసుపాడు కోటయ్య, ఉపాధ్యక్షుడు అంగలకుర్తి ప్రసాద్, సంయుక్త కార్యదర్శి మక్కెన రత్నం తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నారాయణ విద్యార్థుల విజయభేరి



ఎస్.హర్షిత



పి.తేజస్వి

ఒంగోలు: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థులు విజయభేరి మోగించారని ఒంగోలు నారాయణ విద్యా సంస్థల డీజీఎం సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఎస్.హర్షిత 1145వ ర్యాంకు, పి.తేజస్విని 1205వ ర్యాంకు సాధించారన్నారు. ఎస్.సంజయ్ 1409వ ర్యాంకు, కె.సాయిమౌనిక 2023, ఎం.శ్రీలక్ష్మి 2950, ఎస్.సూర్యతేజ 3690, ఎం.రోహన్‌కుమార్ 4375, ఎం.జోషితాలక్ష్మి 4675 ర్యాంకులు సాధించారన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను డీజీఎంతోపాటు డీన్ ఎన్.పిచ్చిరెడ్డి, ప్రిన్సిపాళ్లు ఎస్.సుజాత, షేక్ యాసిన్‌బాషా, ఎస్.శ్రీనివాసరావు అభినందించారు.

బ్యాంక్ మేనేజర్ సేవలు అభినందనీయం

పెద్దదోర్నాల: ఖాతాదారులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించి వారి హృదయాల్లో కెనరా బ్యాంకు సీనియర్ మేనేజర్ శ్రీకాంత్ నిలిచిపోయారని కెనరా బ్యాంకు సిబ్బంది కొనియాడారు. మండల కేంద్రంలో సీనియర్ బ్యాంకు మేనేజరుగా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ భీమవరంకు, మేనేజర్‌గా పనిచేస్తున్న రాజేష్ తమిళనాడుకు, అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణమోహన్ కనిగిరికి బదిలీపై వెళ్తున్న సందర్భంగా సిబ్బంది వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంకు నూతన సీనియర్ మేనేజర్‌గా ఒంగోలు నుంచి బదిలీపై వచ్చిన పాలేటి మురళీకృష్ణ మాట్లాడుతూ శ్రీకాంత్, రాజేష్, కృష్ణమోహన్‌లు పరస్పర అవగాహనతో కెనరా బ్యాంకు సేవలను మెరుగుపరిచారన్నారు. ఎంతో మంది ఖాతాదారులకు ప్రత్యేకంగా రుణాలిచ్చి వారిని ఆర్థికంగా ఆదుకున్నారని కొనియాడారు. విధులు నిర్వహించిన ప్రతి చోటా మంచి పేరు ప్రఖ్యాతులు గడించడంతో పాటు బ్యాంకు సేవలను విస్తృతపరిచారన్నారు. ఈ సందర్భంగా నూతన సీనియర్ మేనేజర్ పాలేటి మురళీకృష్ణ, మేనేజర్ ప్రీతమ్ సాగర్, అసిస్టెంట్ మేనేజర్ భాలసాని భరత్‌లకు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జితేంద్ర, క్లర్క్ రవి, రాంబాబు, అటెండర్ శ్రీను, గోల్డ్ అప్రయిజర్ రాములు, ఖాతాదారులు, సీనియర్ కస్టమర్లు షేక్ ఇస్మాయిల్, తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, భాస్కరరెడ్డి, రావిక్రింది రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొని బదిలీపై వెళ్తున్న మేనేజర్లకు వీడ్కోలు పలికారు.